భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

పవిత్ర ఆషాఢమాసంలో వచ్చే హిందువుల తొలి పండుగైన తొలి ఏకాదశి సందర్భంగా గురువారం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మామిడి తోరణాలు, అరటి బోదెలు, పూల తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంలోని దేవి, దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు ఎక్కువ సంఖ్యలో స్వామివారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. – ఆల్విన్‌కాలనీ




సప్తగిరికాలనీలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం




స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



ఆంజనేయనగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ శిరీష దంపతులు



వివేకానందనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో బక్రీద్ పండుగను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కూకట్‌పల్లి, ఎల్లమ్మబండ, ధరణినగర్, హనుమాన్‌నగర్, తదితర కాలనీల్లోని ఈద్గాలలో సామూహికంగా ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – ఆల్విన్‌కాలనీ



ఎల్లమ్మబండ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు



సయీద్ మిస్బా, మొయిజ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ సభ్యుడు వెంగళరావు






ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు కుమార్‌యాదవ్

క్లుప్తంగా

నిర్వహణ కరువు.. చోరీకి గురవుతూ..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో టాయిలెట్ల నిర్వహణ లోపం కారణంగా వృథాగా పడి ఉన్నాయి. మూడేళ్ల క్రితం వివిధ ప్రాంతాలలో అధికారులు మైల్డ్ స్టీల్ టాయిలెట్లు, బయో టాయిలెట్లను అమర్చారు. కాని వాటి నిర్వహణ మాత్రం అంతంత మాత్రమగానే ఉంది. కాగా లోపల ఉన్న సామగ్రిని అందినకాడికి దోచుకెళ్లారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే నిర్వహణ బాగుంది. మిగితా చోట్ల పనికిరాకుండా పోయాయి. జగద్గిరిగుట్ట కొండపై అమర్చిన టాయిలెట్లలో తాళం పగలగొట్టి మరీ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇక వార్డు కార్యాలయం సమీపంలో మరియు దేవమ్మ బస్తీలో కూడా అదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు టాయిలెట్ల నిర్వహణపై చొరవ చూపి ప్రజలకి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.

1న శాంతి సరోవర్‌లో సాయినిఖిత అరంగేట్రం

రాయదుర్గం: ఆంధ్రనాట్యం నృత్య ప్రదర్శనతో 16 ఏళ్ల సాయినిఖిత అరంగేట్రం చేయనుంది. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ రీజనల్ సెంటర్స్ ఇన్‌చార్జీ రాజయోగి బీకే కుల్‌దీప్, కెమెరామెన్, ఎడిటర్, దర్శకుడు మీర్, ఆయన సతీమణి భువనేశ్వరి, ప్రముఖ నటులు మధుశాలిని, గోకుల్ ఆనంద్ పాల్గొంటారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'మూవింగ్ ఫ్రమ్ ఫియర్ టు లవ్' అనే అంశంపై ప్రఖ్యాత అంతర్జాతీయ మెడిటేషన్ టీచర్ చైనాకు చెందిన బి.కె.స్వప్న ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

జగద్గిరిగుట్ట: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అంజయ్యనగర్‌కు చెందిన ప్రకాష్ (33) ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రకాష్‌కి (టీఎస్15 ఈజె6983) టీవీస్ బైక్ ఉంది. ఎప్పటిలాగే బుధవారం రాత్రి తన గేట్ ముందు పార్క్ చేసాడు. కాగా గురువారం లేచి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

బీటీ రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్

రాయదుర్గం: నానక్‌రాంగూడ ప్రధాన రోడ్డును జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు బీటీరోడ్డుగా మార్చాలని తలపెట్టారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులు చైన్‌మెన్ జావిద్, శ్రీనివాస్‌లు పరిశీలనలో పాల్గొన్నారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడం, ప్రతి ఆదివారం సంత కూడా నిర్వహిస్తుండడంతో ఈ రోడ్డు ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్ళేందుకు ప్రధాన రోడ్డు ఇది. ఈ రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

తెలంగాణలో రైతులకు పెద్దపీట

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు పెద్దపీట వేశారని... ప్రతి నియోజకవర్గంలో వ్యవసాయ కమిటీలు ఏర్పాటు చేసి... రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునే విధంగా వ్యవసాయ మార్కెట్‌లు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ వీనీకుమార్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముందుగా తెలంగాణ ఉద్యమంలో గాయకుడిగా చురుకైన పాత్ర వహించిన సాయిచంద్ మృతికి సంతాపంగా మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం అధికారులు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నూతన మార్కెట్‌ను మంత్రి హరీష్‌రావు సహకారంతో బోయిన్‌పల్లి నుంచి విడిపోయి కేపీహెచ్‌బీ వ్యవసాయ మార్కెట్‌గా ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం వచ్చాక వ్యవసాయానికి, రైతులకు పెద్దపీట వేశారని కొనియాడారు. రైతులకు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆదుకున్నారని తెలిపారు.

◆ పండించిన ధాన్యాన్ని ఎలాంటి దళారుల చేతుల్లో పడకుండా నేరుగా అమ్ముకునే విధంగా ప్రతి నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. మంత్రి కేటీఆర్ సహకారంతో వేల కోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి ఓటు వేయాలని కోరారు.

నూతన కమిటీ సభ్యులు

అధ్యక్షుడుగా కుతాడి రాములు, ఉపాధ్యక్షుగా మందడి సుధాకర్ రెడ్డి, సభ్యులుగా పి. సావిత్రి, బి. భవాని, ఎ. సంతోష్ కుమార్, బి. శ్రీనివాసరావు, బొట్టు విష్ణు, ఎస్. నర్సింగ్‌రావు, ఎండీ. జాహెద్ షరీఫ్ బాబా, ఆర్. వేణుగోపాల్‌రెడ్డి, జి.ప్రభాకర్ రావు, జిల్లా గోపాల్, సయ్యద్ యూసుఫ్‌ఉద్దీన్, చైర్మన్ డీసీఎంఎస్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జిల్లా మార్కెటింగ్ అధికారి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జిల్లా అగ్రికల్చర్ అధికారి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా, మేయర్, జీహెచ్‌ఎంసీ సభ్యులు నియామకపత్రాలు అందుకున్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్



బాలాజీనగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న మాధవరం కాంతరావు

కూకట్‌పల్లి: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం బాలాజీనగర్ డివిజన్ నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజవర్గ ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే విఫలమయ్యారని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు విమర్శించారు. దీనికి నిదర్శనం మాకు వస్తున్న ఫిర్యాదులేనని అన్నారు. ఫిర్యాదులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రక్షణ కరువైందని, భూ కబ్జాలు, అక్రమ అరెస్టులు ఎక్కువయ్యాయని తెలిపారు. ప్రజలు కలలు కన్న బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో అవినీతి, నియంతృత్వ కుటుంబ పాలనకు బుద్ధి చెప్పాలని కోరారు.

బ్రహ్మ గర్జనకు ప్రతి బ్రాహ్మణుడు తరలి రావాలి



బ్రహ్మ గర్జన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు తులసీ శ్రీనివాస్

మూసాపేట: బ్రాహ్మణుల హక్కుల కోసం నిర్వహించే బ్రహ్మ గర్జనకు ప్రతి బ్రాహ్మణుడు తరలిరావాలని బ్రాహ్మణ సేవా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు తులసీశ్రీనివాస్ కోరారు. గురువారం కూకట్‌పల్లిలోని బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యాలయంలో బ్రాహ్మణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జులై 9న సరూర్‌నగర్‌లో జరిగే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బ్రాహ్మణులు, వేలాది మంది మహిళలతో శ్రీలలితా విష్ణు సహసనామ పారాయణం, వేద ఘోష, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రాహ్మణులను ఆర్థికంగా, రాజకీయంగా హక్కులు, చట్ట సభల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు పుండరీకాక్ష శర్మ, మూసాపేట అధ్యక్షుడు గరికపాటి శర్మ, సభ్యులు వెంకట ప్రగడ సుబ్బారావు, సీవీ రావు, సుశీల, సుబ్బయ్య, శ్రీనివాస్, భాస్కర మూర్తి, రఘునందన్, తులసి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సాయిచంద్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు మల్లేష్, భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి

సాయిచంద్‌కు నివాళి

భాగ్యనగర్‌కాలనీ: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతికి గురువారం హైదర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు సిందం శ్రీకాంత్ మాట్లాడుతూ.. సాయిచంద్ హఠాన్మరణం చాలా బాధాకరమన్నారు. ఒక మంచి నాయకుడిని కోల్పోయామని ఇది బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి..

మూసాపేట: ఉద్యమ గాయకుడు సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం వెంకటేశ్వరనగర్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, జనరల్ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు నగేష్, మహేష్, రవీందర్‌రెడ్డి, వెంకటేష్, రాము, కృష్ణ, యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.

3న గురుపౌర్ణమి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలను సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డి రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి గురువారం ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ఉత్సవాలు ప్రారంభిస్తారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు పంచామృతాభిషేకం, సాయిఅష్టోత్త రాలు, విష్ణుసహస్రనామం, భజన కార్యక్రమాలు, 9 గంటలకు శేజ్ హారతితో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రణీత్ నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలి

నిరసనకు దిగిన గౌతమినగర్ వాసులు



ప్రణీత్ నిర్మాణ సంస్థ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

భాగ్యనగర్‌కాలనీ: ప్రణీత్ నిర్మాణ సంస్థ సెల్లార్ నిర్మాణంలో భాగంగా గౌతమినగర్‌లో రోడ్డు కుంగిపోవడంతో కాలనీవాసులు గురువారం ఆందోళనకు దిగారు. అధికారులు సంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే కాకుండా తమ ఇళ్లను ఖాళీ చేసి మరోచోటికి వెళ్లాలని చెప్పడం దారుణమన్నారు. తాము ఎక్కడికి వెళ్లాలని గురువారం ప్రణీత్ సంస్థ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. ప్రణీత్ యాజమాన్యం సమస్యను పరిష్కరించేంత వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. బుధవారం కుంగిపోయిన రోడ్డుకు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, ప్రణీత్ నిర్మాణ సంస్థ నిర్వాహకులతో రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. రోడ్డు కుంగిపోయిన విషయాన్ని తెలుసుకున్న బీజేపీ, టీడీపీ నాయకులు చేరుకొని కాలనీవాసులకు మద్దతు ప్రకటించారు. నిర్మాణ సంస్థపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీవాసుల రాకపోకలకు రోడ్డును తిరిగి నిర్మించాలన్నారు.

పదో తరగతి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

రంగారెడ్డినగర్: ప్రతిభకు ఎల్లలు లేవని నిరూపించేది విద్యార్థులేనని ఏసీపీ అల్లం సుభాష్ చంద్రబోస్ అన్నారు. రెండేళ్ల క్రితం కరోనాతో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, సంఘ సేవకులు జింకల రవితేజ ముదిరాజ్ ద్వితీయ వర్ధంతిని గురువారం పంచశీలకాలనీలో రవితేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు జింలక వెంకటేష్‌ముదిరాజ్, పారిశ్రామికవేత్త వాకిటి రామ్‌రెడ్డి ల చేతుల మీదుగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సత్కరించారు.

◆ ఈ సందర్భంగా చెన్నారెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాల పూర్వవిద్యార్థి తండూరి భాషయ్య పది కుర్చీలను ఉపాధ్యాయురాలు పార్వతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, కుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సారా శంకర్‌ముదిరాజ్, గాంధీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు, శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్, సూర్యనారాయణ పంచశీల కాలనీవాసులు కేఎల్ రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, సతీష్, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లి - బహదూర్‌పల్లి రోడ్డును విస్తరించడంలో విఫలం



కొంపల్లిలో గడప గడపకు బీజేపీ ప్రచారంలో పాల్గొన్న రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: నియంత పోకడలతో సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని తెలంగాణ బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డా. మల్లారెడ్డి అన్నారు. గురువారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా కొంపల్లిలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల నిధులతో సుచిత్ర నుంచి కొంపల్లి వరకు 6లైన్ల రోడ్ల విస్తరణతో పాటు ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపడుతోందన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం కొంపలి నుంచి బహదూర్‌పల్లి వరకు ఉన్న రోడ్డు విస్తరణ మాత్రం చేపట్టలేకపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ రాజిరెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చక్రధర్, జీవన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజు, శ్రీకాంత్, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం గండిమైసమ్మ చౌరస్తాలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్‌ల ఆధ్వర్యంలో సంయుక్త మోర్చాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తోందని పేర్కొన్నారు. పార్టీలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, యువ మోర్చా, మహిళా మోర్చాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యకర్తలు సమష్టిగా పని చేస్తే పార్టీ గెలుపు నల్లేరు మీద నడకేనని అన్నారు.

◆ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రెండూ కుటుంబ పార్టీలేనని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దింపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాధవి, రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు దాసరి శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.